RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 09 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 265 | పేజీలు : 4 | వెల : 5/-

ఖర్గే పేపర్.. మాకు దిష్టిచుక్క!

4లో

హామీలకు హామీ!

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :
తెలంగాణ ప్రజలు వారి ఆకాంక్షలు ప్రతిబింబించేలా నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం గల పరిపాలనను ఎన్నుకున్నారని గవర్నర్ తమిళిసై అన్నారు. గురువారం తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా.. ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. తొలుత కాళోజీ కవితతో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్.. ఈ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందని అన్నారు. ఒకప్పుడు ప్రజాభవన్‌కు అనుమతి లేని ప్రజలకు నేరుగా తమ సమస్యలు చెప్పుకునేలా సిద్ధం చేశామన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కంచెను తొలగించినట్లు గుర్తు చేశారు. ప్రజలకు మేలు చేకూరేలా ఆరు గ్యారెంటీలను అమల్లోకి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. 'మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం. అప్పుల కుప్పగా మార్తి తమకు అప్పగించిన రాష్ట్రాన్ని పునఃనిర్మించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే మరో 2 గ్యారెంటీలను అమలు చేస్తాం. అర్హులకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అమలు చేస్తాం. దశాబ్ద కాలంలో నష్టపోయిన సంస్థలను తిరిగి కోలుకునేలా చేస్తాం. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతాం.' అని గవర్నర్ వివరించారు.రాష్ట్రంలో త్వ-రలోనే కుల గణన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ తమిళిసై తెలిపారు. వివిధ కులాలు ముఖ్యంగా వెనుకబడిన తరగతుల సామాజిక

మిగతా 2వ పేజీలో...

హామీలపై స్పష్టత లేదు

- ప్రజలకు నిరాశ మిగిల్చిన గవర్నర్ ప్రసంగం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :
: హామీల అమలుకోసం ఎదురు చూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం నిరాశ మిగిల్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎన్నికల హామీల అమలుపై స్పష్టత లేదని హరీశ్ రావు విమర్శించారు.

3లో

13 వరకు అసెంబ్లీ

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్ లో గురువారం బీఏసీ సమావేశం ముగిసింది. ఈ నెల 13 వరకూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. ఈ నెల 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సభలో చర్చిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 10న ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నట్లు చెప్పారు.

3లో

వాళ్లకు వాళ్లే.. సవాళ్లు..!

కాంగ్రెస్‌కు నామినేటెడ్ పోస్టుల సవాళ్లు

మెదక్-ప్రభాతసూర్యుడు :
అధికారాన్ని అడ్డుపెట్టుకోవాలని పదేళ్లు.. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ ఇప్పుడు అదే అధికారం అడ్డుపెట్టుకు కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాలతో ఇబ్బందులు పడుతోంది. కాంగ్రెస్ పార్టీ వేస్తున్న గాలానికి గులాబీ నేతలు ఒక్కొక్కరుగా చిక్కుతున్నారు. తాజాగా పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరో ఇద్దరు ఎంపీలు కూడా చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా లైన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా, కాంగ్రెస్‌లో నామినేషన్ పదవులపై అనేకమంది ఆశలు పెట్టుకున్నారు. 56 నామినేషన్ పోస్టుల భర్తీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్‌గా మారింది. అయితే ఆయన తను ఇబ్బంది పడకుండా భారాన్ని అధిష్టానంపైనే వేస-్తున్నారు. ఎవరికి పదవి అంటే వారికి ఇవ్వడానికి సిద్ధం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు పిబ్రవరి 5న ఢిల్లీ వెళ్లిన సీఎం ఈ విషయమై అధిష్టానంతో చర్చించినట్లు తెలుస్తోంది.నామినేటెడ్ పదవి ఆశిస్తున్న వారిలో దాదాపు వంద మంది వరకు ఉన్నారు. కానీ ఉన్న పదవులు 56 మాత్రమే. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ-్రెడ్డి, ఎస్సీసెల్ చైర్మన్ ప్రీతమ్, ఎస్టీ సెల్ చైర్మన్ బెల్లయ్యనాయక్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయి, ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, ప్రొటోకాల్ చైర్మన్ వేణుగోపాల్ తదితరులు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. వీరితోపాటు పీసీసీ కార్యదర్శులు, చరణ్ భవనీరెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి, యెన్నెం శ్రీకాంత్‌రెడ్డి, చిలక

మిగతా 3వ పేజీలో...

కాళేశ్వరంపై సీఎం కీలక వ్యాఖ్యలు

- రిటైర్డ్ జడ్జితో విచారణకు ప్రణాళికలు
- అసెంబ్లీలో చర్చించిన తర్వాత నిర్ణయం
- బీఆర్ఎస్‌ను తిరస్కరించిన ప్రజలు
- గవర్నర్ ప్రసంగానికి రాలేదంటేనే కేసీఆర్ బాధ్యత ఏంటో అర్థమవుతోంది
- రాజ్యసభ ఎన్నికల బాధ్యత అధిష్టానానిదే
- అసెంబ్లీ సమావేశాల అనంతరం మీడియా చిట్‌చాట్‌లో రేవంత్ రెడ్డి

2లో

గులాబీకి దీటుగా కాంగ్రెస్ సభ

నల్లగొండ- ప్రభాతసూర్యుడు :
నల్గొండలో బీఆర్ఎస్‌కు పోటీగా భారీ సభకు ప్లాన్ చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎంపీ అభ్యర్థుల ఎంపికపై సమావేశమైన పీఈసీ.. లోక్‌సభ ఎన్నికలతో పాటు తాజా రాజకీయ అంశాలపైనా చర్చించింది. కాళేశ్వరం కుంగిన అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఈ సందర్భంగా పార్టీ నేతలకు స్పష్టంచేశారు సీఎం రేవంత్‌రెడ్డి.నల్గొండలో బీఆర్ఎస్‌కు పోటీగా భారీ సభకు ప్లాన్ చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎంపీ అభ్యర్థుల ఎంపికపై సమావేశమైన పీఈసీ.. లోక్‌సభ ఎన్నికలతో పాటు తాజా రాజకీయ అంశాలపైనా చర్చించింది. కాళేశ-్వరం కుంగిన అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఈ సందర్భంగా పార్టీ నేతలకు స్పష్టంచేశారు సీఎం రేవంత్‌రెడ్డి.అసెంబ్లీ ఎన్నికల్లో సత్తాచాటిన హస్తం పార్టీ. పార్లమెంటు ఎన్నికల్లోనూ అదే జోరు కొనసాగించా లనుకుం

టోంది. అయితే టికెట్ ఆశించే నేతల జాబితా భారీగా ఉండడంతో.. అభ్యర్థుల వడపోతపై దృష్టిసారించింది అధిష్ఠానం. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గాంధీ భవన్‌లో సమావేశమైన ప్రదేశ్ ఎన్నికల కమిటీ.. పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థుల జాబితాపై చర్చించింది. నియోజకవర్గాల వారీగా ఇద్దరు లేక

మిగతా 2వ పేజీలో...

టాలీవుడ్‌లో కిలేడీ ప్రొడ్యూసర్



హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :
మగవారి చేతిలో ఆడవాళ్లు మో-సపోయే రోజులు పోయి.. ఆడవాళ్ల చేతిలో మోసపోతున్న మగవాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కలికాలం అంటే ఇదేనేమో. పెళ్లి చేసుకుంటామని నమ్మించడం... బుట్టలో పడిన బకరాను నిలువునా దోచేయడం... కిలేడీల లేటెస్ట్ ట్రెండ్ ఇదే. వాళ్లు చూపే ప్రేమంతా నిజమేనేమో అని నమ్మి నిలువుదోపిడీ ఇచ్చుకుంటున్నారు అబ్బాయిలు. నిండా మునిగిపోయాక గానీ... వారి మాయ నుంచి తేరుకోవడంలేదు. మొత్తం ఖాళీ అయ్యాక... మో-సపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. అటు ఆశించిన జీవితం... ఇటు అకౌంట్లో డబ్బు.. రెండు దూరమై... రోడ్డున పడుతున్నారు. హైదరాబాద్‌లో తాజాగా ఇలాంటి సంఘటన జరిగింది. పెళ్లి పేరుతో అసిస్టెంట్ డైరెక్టర్‌ను నిలువునా ముంచేసింది లేడీ ప్రొడ్యూసర్. ఆమె వలలో పడి ఉన్న డబ్బంతా ఊడ్చి ఇచ్చేసి.. ఇప్పుడు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న ఆ అభాగ్యుడి కథేంటో ఒకసారి చూద్దాం.హైదరాబాద్‌లోని వెంకటగిరి ప్రాంతానికి చెందిన 35ఏళ్ల పుల్లంశెట్టి నాగార్జున బాబు... తెలుగు సినీ పరిశ్రమలో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో అతనికి మహిళా నిర్మాత పరిచయం అయ్యింది. షూటింగ్ మాటలు కలిపింది. అతని వివరాలు... ఆస్తిపాస్తులు, బ్యాంకు బ్యాలెన్స్ వివరాలు అన్నీ రాబట్టుకుంది. సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత... నాగార్జున బాబుకి ఫోన్ చేసి రాత్రి డిన్నర్ కోసం ఆమె ఇంటికి ఆహ్వానించింది. డిన్నర్ చేస్తూ పులిహోర కలిపేసింది. తనకు పెళ్లయిందని... భర్తకు విడాకులు ఇచ్చేస్తాను మనం పెళ్లిచేసుకుందామని...

మిగతా 3వ పేజీలో...

ఇంటింటికి రామయ్య ఫోటోలు

కరీంనగర్-ప్రభాతసూర్యుడు :
అయోధ్యలో బాల రామయ్య కొలువు దీరిన వేళ అందరి అడుగులు రామయ్య దర్శనం కోసమే అన్నచందంగా ఉంది. తాజాగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అయోధ్య రాముడు ప్రతి ఇంటా కొలువుదీరబోతున్నడు. ముఖ్యంగా అయోధ్యలో రామ మందిర ప్రాణ:ప్రతిష్ట ప్రారంభమైనప్పటి నుండి తెలంగాణలో ప్రత్యేకించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికులు అయోధ్య వెళ్లాలని, శ్రీరామ చంద్రుడిని దర్శించాలని ఆశిస్తున్న

మిగతా 2వ పేజీలో...

కేసీఆర్‌పై ఇష్టారీతిగా ధూషణలు

- ఎమ్మెల్సీ కవిత అసహనం
- మాజీ డీజీపీపై ఎంక్వైరీకి డిమాండ్

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :
సింగరేణి ఉద్యోగ మేళా సందర్భంగా సీయం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీయం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యల పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. గురువారం నాడు బంజారాహిల్స్ లోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని

మిగతా 4వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు

రాజన్న సిరిసిల్ల-ప్రభాతసూర్యుడు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సమ్మక్క సారక్క జాతర సందర్భంగా రాజన్న దర్శించుకోవడం ఆనవాయితీ. గత 15 రోజులుగా రాజన్న ఆలయంలో ప్రతిరోజు భక్తుల రద్దీ కొనసాగుతుంది. ముఖ్యంగా ఆలయంలో ప్రధాన మొక్కుబడి అయిన కోడె మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే, హుండీలో కానుకలు, నగదు సమర్పిస్తారు. 14 రోజుల హుండీ లెక్కింపులో నగదు రూపేనా 2 కోట్ల 15 లక్షల 67 వేల 130 రూపాయలు, 71 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి రికార్డు స్థాయిలో సమకూరింది.

సీతమ్మకు.. సమ్మక్కకు పోలిక

వరంగల్-ప్రభాతసూర్యుడు :
రామాయణంలో సీతమ్మ తల్లి జన్మకు.. మేడారం సమ్మక్క పుట్టుకకు పోలికుందా..? సీతమ్మ తల్లి.. సమ్మక్క తల్లి.. ఇద్దరి జన్మకు ఉన్న సారూప్యత ఏంటి..? నానారకాల కథలు ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ అసలు సమ్మక్క తల్లి పుట్టిందెక్కడ..? రామాయణంలో సీతమ్మ తల్లి భూదేవి కుమార్తె.. కాగా మేడారం సమ్మక్కకు సంబంధించిన ఓ కథలో కూడా సమ్మక్కను భూదేవి కుమార్తెగానే అభివర్ణిస్తున్నారు. రామాయణం ప్రకారం మిథిలాపుర రాజైన జనకమహారాజు ఒకానొక సమయంలో భూమి దున్నుతున్న సమయంలో ఏదో అడ్డు తగిలి నాగలి ముందుకు కదలకుండా ఆగిపోతుంది. ఎంత ప్రయత్నించినా నాగలి కొంచెం కూడా కదలకుండా ఆగిపోవడంతో జనక మహారాజు వెంటనే వచ్చి నాగలి కర్రును పరిశీలిస్తాడు. నాగలికి ఏదో అడ్డుతగిలిందని గమనించి వెంటనే అక్కడ మట్టిని తోడగా.. ఒక పెట్టె కనిపిస్తుంది. ఆ పెట్టెను బయటకు తీసి, తెరచి చూడటంతో అందులో ఒక పసిపాప దర్శనిమిస్తుంది. దీంతో జనక మహారాజు ఆ పసిపాపను చేతుల్లోకి తీసుకుని, ఇంటికి తీసుకెళ్తాడు. పసిపాపకు సీతాదేవిఅని నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచుతాడు. నాగలితో దున్నుతుంటే భూమి లోపల దొరికింది కాబట్టి సీతను భూదేవికుమార్తె అని కూడా అంటుంటారు. సమ్మక్క పుట్టుక గురించి రెండు, మూడు కథలు ప్రచారంలో ఉండగా.. అందులో ఒక కథ సీత జన్మకు అత్యంత దగ్గర పోలికను కలిగి ఉంది. చరిత్రకారులు, కొందరు పూర్వీకులు చెబుతున్న ప్రకారం.. ములుగు జిల్లాలోని బయ్యక్కపేటలో ఆదివాసీ కోయ తెగకు చెందిన చందా వంశస్తులున్నారు. సమ్మక్కను తమ వంశపు ఆడబిడ్డగా ఇక్కడి చందా వంశస్తులు చెబుతుంటారు. పూర్వం రాయిబండరాజు పెద్ద భార్య చందా బోయిరాలు ఒకరోజు దుంపల కోసం అడవిలోని కంకవనానికి వెళ్తుంది. అక్కడ ఎల్లేరు గడ్డ కోసం తవ్వుతుండగా గడ్డపారకు ఏదో గట్టి వస్తువు తగిలింది. దీంతో చందాబోయిరాలు ఆ మట్టిని పక్కకు తవ్వి చూడగా అందులో ఓ పెట్టె కనిపించింది. అనంతరం ఆ పెట్టెను తెరచి చూడగా అందులో పసిపాప కనిపించింది. సంతానం లేని తనకు భూమాత బిడ్డను ప్రసాదించిందని సంతోషంగా పసిపాపను ఇంటికి తీసుకెళ్లి బిడ్డకు సమ్మక్క అని నామకరణం చేసి సాదుకున్నారని చందా వంశస్తులు చెబుతుంటారు. దీంతోనే సమ్మక్క బయ్యక్కపేట బిడ్డ అని పూర్వీకులు వాదిస్తుంటారు. కాకతీయులతో యుద్ధం తరువాత మేడారం జాతరను మొదట బయ్యక్కపేటలోనే నిర్వహించేవారు. సమ్మక్క-సారలమ్మను దేవతలుగా ప్రతిష్టించుకుని కొలిచేవారు. ఇదే గ్రామానికి చెందిన సిద్దబోయిన వంశస్తులు కూడా అమ్మవార్లను కొలిచేవారు. కానీ 1962 తరువాత పరిణామాల నేపథ్యంలో చందా వంశస్తులు కరువు కాటకాలతో జాతర నిర్వహించలేకపోయారు. ఈ మేరకు సిద్దబోయిన వంశస్తులతో ఒప్పందం మేరకు అప్పటినుంచి జాతరను మేడారంలోనే నిర్వహిస్తున్నారు. కాగా ప్రతి జాతర సమయంలో బయ్యక్కపేట పూజారులు ఒడిబియ్యం, చీర, సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రెండు కథల ప్రకారం సీతమ్మ తల్లి, సమ్మక్క తల్లి.. ఇద్దరి జన్మల మధ్య సారూప్యం ఉండటంతో సమ్మక్కను కూడా కొందరు భూదేవి కుమార్తెగానే భావిస్తూ కథలు చెబుతుంటారు. సమ్మక్క పుట్టుక గురించి ఒక్కోచోట ఒక్కో రకమైన కథ ప్రచారంలో ఉంది. ములుగు జిల్లా బయ్యక్కపేటనే సమ్మక్క తల్లి జన్మస్థలమని కొందరు అంటుండగా.. జగిత్యాల జిల్లా పొలవాస అని మరికొందరు అంటున్నారు. ఇంకొందరేమో సమ్మక్క తల్లి పుట్టింది ప్రస్తుత హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ అని కూడా చెబుతుంటే.. సమ్మక్క తల్లి ఛత్తీస్ గడ్ లోనే పుట్టిందని అక్కడి జనాల ప్రచారంలో కూడా ఉంది. కరీంనగర్ జిల్లా జగిత్యాలలోని 'పొలవాస'ను 12వ శతాబ్దంలో గిరిజన దొర మేడరాజు పాలించాడు. వేట కోసం అడవికి వెళ్లిన ఆయనకు పులుల మధ్యన, దివ్యకాంతులతో ఒక పుట్ట మీద పసిపాప కనిపించగా తెచ్చి సమ్మక్క అని పేరు పెట్టారు. ఆ పసిపాప రాజ్యంలో కాలుమోసిన తరువాత అక్కడ అన్నీ శుభాలే జరిగాయని పూర్వీకులు చెబుతుంటారు. ఈ కథ చాలాచోట్లా ప్రచారంలో ఉండగా సమ్మక్క జన్మ స్థలం పొలవాస అనే వాదనలు వినిపిస్తుంటాయి. కాగా సమ్మక్కను పెంచి పెద్ద చేసిన అనంతరం మేడరాజు తన మేనల్లుడైన మేడారం ప్రాంతాన్ని పరిపాలించే పగిడిద్దరాజుకు ఇచ్చి పెళ్లి జరిపించాడు. వీరికి సారలమ్మ, నాగులమ్మ కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు పుట్టారు. సారలమ్మకు గోవిందరాజులుతో వివాహం జరిగింది. ఆ తరువాత కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు రాజ్య కాంక్షతో మేడారంపై దండెత్తగా.. మేడరాజు మేడారానికి వెళ్లి అజ్ఞాతంలోకి చేరుతాడు. ఇక పోరులో పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు వీరమరణం పొందారు. జంపన్న సంపెంగ వాగులో దూకి చనిపోయాడు. సమ్మక్క తీవ్ర గాయాలతో శత్రువులను హతమార్చుతూ మేడారానికి తూర్పు దిశగా ఉన్న చిలకలగుట్ట వైపు సాగుతూ అదృశ్యమైంది.

అగ్రంపహాడ్.. చత్తీస్‌గడ్..?

ఇప్పటికే సమ్మక్క పుట్టింది బయ్యక్కపేటనా లేదా పొలవాసనా అనే గందరగోళం ఉండగా అసలు సమ్మక్క పుట్టింది హనుమకొండ జిల్లాలోని అగ్రంపహాడ్ గ్రామమేనని అక్కడి పూర్వీకులు చెబుతున్నారు. సమ్మక్క జన్మ స్థలం అగ్రం పహాడ్ అనే భావనతో ఇక్కడ మేడారం తరువాత మేడారం అంతటి స్థాయిలో జాతర నిర్వహిస్తుంటారు. ఇక్కడికి ప్రతి జాతర సమయంలో 50 లక్షల నుంచి 60 లక్షల మంది వరకు భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు. ఛత్తీస్‌గడ్‌లోని కొందరు ఆదివాసీలు మాత్రం సమ్మక్క తమ ప్రాంతానికి చెందిన ఆడబిడ్డేనని చెబుతుంటారు. సమ్మక్క ఛత్తీస్‌గడ్ లో పుట్టి, మేడారానికి వచ్చిందని అక్కడి ప్రాంతంలో మరో రకమైన కథను ప్రచారం చేశారు. దీంతో సమ్మక్క ఎక్కడ పుట్టిందనే విషయంపై నానారకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. బయ్యక్కపేట లేదా పొలవాస ఈ రెండు ప్రాంతాల్లోనే సమ్మక్క పుట్టిందని చాలామంది చరిత్రకారులు బలంగా చెబుతుండటం గమనార్హం. వాస్తవానికి సమ్మక్క పుట్టుక గురించి కచ్చితమైన పరిశోధనలు జరగకపోగా.. ఆ తల్లి జన్మకు సంబంధించి లిఖితపూర్వక ఆధారాలు, శాసనాలు ఏమీ లేవని చరిత్రకారులు కూడా చెబుతున్నారు.

కాళేశ్వరంపై సీఎం కీలక వ్యాఖ్యలు

- రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించుకోవాలని హైకోర్టు సూచించింది
- కృష్ణా బేసిన్ ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారు
- గవర్నర్ ప్రసంగానికి రాలేదంటేనే కేసీఆర్ బాధ్యత ఏంటో అర్థమవుతోంది
- అసెంబ్లీ సమావేశాల అనంతరం మీడియా చిట్‌చాట్‌లో రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :
కాళేశ్వరంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం చిట్‌చాట్‌లో రేవంత్ మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంపై విచారణకు సిట్టింగ్ జడ్జిని ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసిందని చెప్పారు. రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించుకోవాలని హైకోర్టు సూచించిందని గుర్తు చేశారు. హైకోర్టు అంశాలను కేబినెట్‌లో లేదా అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. కృష్ణా .జలాల విషయంలో కేసీఆర్ చిత్తశుద్ధిని ప్రజలు చూశారని చెప్పారు. కృష్ణా బేసిన్ ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారన్నారు. కేసీఆర్ గురించి ప్రజలు మర్చిపోయారని తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి రాలేదంటేనే కేసీఆర్ బాధ్యత ఏంటో అర్థమవుతోందన్నారు. కేసీఆర్ కాలం చెలిన ఔషధమని పేర్కొన్నారు. విపక్షనేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. మిషన్ భగీరథపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఉద్యోగ నియామకాల విషయంలో తాము ఎంతో స్పష్టతంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. మరోవైపు రాజ్యసభ ఎన్నికల్లో ఎవరు పోటీచేస్తారనేది.. అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేస్తామని తెలిపారు. అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు చాంబర్ ఇవ్వాలని కోరారు. వారికి చాంబర్ ఎక్కడ ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వవద్దు అనేది తమ పరిధిలోని అంశం కాదని.. ఇది స్పీకర్ పరిధిలోని అంశంగా ఆయన పేర్కొన్నారు.

హామీలకు హామీ!

మొదటిపేజీ తరువాయి..
విద్యాపరమైన ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అంచనా వేయడానికి అవసరమైన సమాచారాన్ని ఈ ప్రక్రియ ద్వారా సేకరిస్తామన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి అందరి వివరాలు సేకరిస్తామని చెప్పారు. 'సమాజంలో వివక్ష, అణచివేతకు గురైన అన్ని వర్గాలకు న్యాయం చేకూరుస్తాం... సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలలో భాగంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ , పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, అమర వీరుల కుటుంబాలు, ఇతర అవసరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది.' అని పేర్కొన్నారు. బడ్జెట్ లో ప్రవేశ పెట్టే ప్రతీ రూపాయి ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు చేస్తామని గవర్నర్ తమిళిసై అన్నారు. 'బడ్జెట్ కేవలం ఒక ఆర్థిక పత్రం మాత్రమే కాదు.. మనం కోరుకున్న ఉమ్మడి భవిష్యత్‌కి ఒక నమూనా. ఇది మన ప్రజల ఆకాంక్షలను అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీక, బడ్జెట్‌లో నిధులను సమర్థవంతంగా కేటాయించి ఖర్చు చేసే ప్రతి రూపాయి తెలంగాణ సంక్షేమం పురోగతి దోహదపడేలా చేయడాన్ని నా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మనం ఆశిస్తున్న తెలంగాణలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతూ.. ప్రాథమిక హక్కులు పరిరక్షిస్తూ అంబేద్కర్ స్ఫూర్తి మన కార్యచరణకు మార్గదర్శకంగా ఉంటుంది. బడ్జెట్ ప్రక్రియ అనేది కేవలం వార్షిక మొక్కుబడి కాదని గుర్తించుకోవాలి. ఇది మనం ఆశించిన అభివృద్ధికి చోదకంగా ఉంటూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఎంతో ప్రేమతో ఎన్నుకున్న ప్రజానీకపు ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తుంది.' అని తెలిపారు. నైపుణ్య విశ్వవిద్యాలయాల ఏర్పాటులో పెట్టుబడి పెట్టి, క్రీడా మౌలిక సదుపాయాలను పెంచడం ద్వారా పోటీ ప్రపంచంలో యువత రాణించడానికి అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలతో వారిని సన్నద్ధం చేస్తామని గవర్నర్ తెలిపారు. తద్వారా క్రీడలు మన సంస్కృతిలో భాగమయ్యేట్టు చేస్తామన్నారు. 'క్రీడారంగ సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న ప్రభుత్వ చర్యలు నిబద్ధతకు తార్కాణం. ఈ చర్యలు ద్వారా తెలంగాణలోని యువత ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించడంతోపాటు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతారు. ఆధునిక క్రీడా సదుపాయాలను కల్పించి, స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తూ జాతీయ అంతర్జాతీయ వేదికలపై రాణించడానికి ఔత్సాహిక అథ్లెట్లకు ఓ వేదికను ఏర్పాటు చేసే ప్రణాళికలను రూపొందిస్తాం. ఈ చర్యల ద్వారా ఔత్సాహిక క్రీడాకారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి, తెలంగాణని క్రీడా రంగంలో అగ్రగామిగా ఎదిగేలా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.' అని వివరించారు. ఇప్పటివరకూ నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని గవర్నర్ తమిళిసై అన్నారు. 'ప్రభుత్వం పెద్ద ఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను చేపట్టనుంది. మూసీ మరొకసారి హైదరాబాద్ జీవనాడిగా మారనుంది. దాని చుట్టూ ఉన్న మొత్తం పట్టణ ల్యాండ్ స్కేప్ పునరుజ్జీవింప చేయడమే లక్ష్యం. నగర తూర్పు, పశ్చిమ భాగాలను అనుసంధానించే రవాణా నెట్‌వర్క్‌ను స్వచ్ఛమైన నీటిని, రివర్ ఫ్రంట్ సుందరీకరణ వంటి అంశాలు ఈ ప్రాజెక్టులో అంతర్భాగం. పీపుల్స్ ప్లాజా పాదచారుల జోన్‌లు హాకర్ ప్రాంతాలు, నగరమంతటా పచ్చని ప్రదేశాలు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు కానున్నాయి. నగరంలోని పురాతన , వారసత్వ ప్రాంతాల పునరుజ్జీవనం వల్ల ప్రజలకు మరింతగా చేరువవుతాయి. ఈ విషయంపై తగు చర్యలు చేపట్టడానికి ఉత్తమ పద్ధతులను అవలంభించడానికి ఖ్యాతి గాంచిన జాతీయ అంతర్జాతీయ నమూనాలను అధ్యయనం చేస్తున్నాం. ఇంతకు ముందు చేయని విధంగా పెద్ద ఎత్తున సకాలంలో పర్యావరణ ఆర్థిక మార్పునకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.' అని పేర్కొన్నారు.

ఇంటింటికి రామయ్య ఫోటోలు

మొదటిపేజీ తరువాయి..
వారే ఎక్కువ. ఈ నేపథ్యంలో రాములోరి ప్రతి భక్తుడి ఇంటికి అయోధ్య రామయ్య రాబోతున్నడు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో ఇంటింటా కొలువు దీరేలా అయోధ్య రామయ్య చిత్రపటాలను తయారు చేయించారు. అందుకోసం తన పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంత మంది ఓటర్లున్నారు? ఎన్ని కుటుంబాలున్నాయి? అందులో అయోధ్య రామ య్యను తలిచి కొలిచే వాళ్లెందరు న్నారు? అనే వివరాలను సేకరించారు .కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న రామయ్య భక్తుల ఇంటింటికి అయోధ్య రామయ్య చిత్ర పటాన్ని పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిని దృష్టి లో ఉంచుకుని 4 లక్షల 21 వేల 11 వందల అయోధ్య రాముడి చిత్ర పటాలను తయారు చేయించారు బండి సంజయ్.. ఇప్పటికే లక్షకుపైగా రామయ్య చిత్ర పటాలు సిద్ధం కావడంతో ఇంటింటికీ చేరవేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి.

గులాబీకి దీటుగా కాంగ్రెస్ సభ

మొదటిపేజీ తరువాయి..

ముగ్గురు నేతలను పీఈసీ ఎంపిక చేసి ఆ జాబితాను కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన ఈ విధానాన్నే పార్లమెంటు ఎలక్షన్స్‌లోనూ ఫాలో అవుతోంది హస్తం పార్టీ. పీఈసీలో కీలక అంశాలపై మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో 15 లోక్‌సభ స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని చెప్పారు. టికెట్ ఆశించే నేతల సంఖ్య వందల సంఖ్యలో ఉండడంతో అభ్యర్థుల ఎంపిక.. పార్టీకి కష్టంగా మారినట్టు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు 309 మంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే గెలిచే అవకాశం ఉన్నవారికే టికెట్లు ఇస్తామని పీఈసీ సభ్యుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. దరఖాస్తు చేయనివారి పేర్లనూ పరిశీలిస్తామని.. అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానానిదే తుది నిర్ణయమని తేల్చిచెప్పారు. రానున్న ఎన్నికల్లో 13 సీట్లకు తగ్గకుండా ఎంపీ సీట్లు గెలవడానికి కృషి చేయాలని కాంగ్రెస్ పీఈసీ తీర్మానం చేసింది. అభ్యర్థుల ఎంపికతో పాటు తాజా రాజకీయ అంశాలపైనా చర్చ జరిపారు నేతలు. కాళేశ్వరం కుంగిన అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని.. పార్టీ నేతలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బీఆర్ఎస్ సభకు పోటీగా నల్గొండ పార్లమెంట్ పరిధిలో 2 లక్షల మందితో సభ పెట్టాలని కోరారు మంత్రి కోమటిరెడ్డి. ఈ సభకు ప్రియాంక గాంధీని పిలవాలని నిర్ణయించారు. ఇక కాంగ్రెస్‌కు పరిపాలన చేతకాలేదన్న బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చారు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. ఓవైపు పార్లమెంటు ఎన్నికలకు సన్నద్ధం అవుతూనే మరోవైపు బీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొవాలని నిర్ణయించింది కాంగ్రెస్ పార్టీ. అందులో భాగంగానే పీఈసీలో నేతలు చర్చలు జరిపినట్టు తెలుస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

రైల్వే కౌంటర్లలో యూపీఐ పేమెంట్స్



ముంబై - ప్రభాతసూర్యుడు : రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్త పాలసీ తీసుకొచ్చింది దక్షిణ మధ్య రైల్వే. టికెట్ కౌంటర్ల దగ్గర డిజిటల్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికుల కష్టాలతో పాటు టికెట్ కౌంటర్ దగ్గర రైల్వే సిబ్బంది పడుతున్న బాధలను అర్థం చేసుకుని... ఈ నిర్ణయం తీసుకుంది. రైల్వే టికెట్ కౌంటర్లలో డిజిటల్ చెల్లింపులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. దీంతో.. ఇకపై టికెట్ కొనేందుకు చిల్లర కోసం వెతుక్కోవాల్సిన పనిలేదు. డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ కొనుక్కోవచ్చు. అంతేకాదు... రైల్వే కౌంటర్లలో డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేయొచ్చు. దక్షిణ మధ్య రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం... మధ్యతరగతి ప్రజలకు ఊరట నిస్తోంది. సుదూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే మధ్యతరగతి వారు ఎంచుకునేది రైలు ప్రయాణమే. అయితే రైలు టికెట్ల బుకింగే కొంచెం కష్టం. ముందస్తు ప్లాన్ ఉండి... 20, 30 రోజుల ముందే టికెట్ బుక్ చేసుకుంటే పర్వాలేదు. లేదంటే చుక్కలే. ఇక టికెట్ టికెట్ బుకింగ్ విషయానికి వస్తే... అవగాహన ఉన్న వాళ్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటారు. లేని వాళ్లు... రైల్వేస్టేషన్లలో టికెట్ కౌంటర్ల దగ్గరకు వెళ్లి.. టికెట్ రిజర్వ్ చేయించుకుంటారు. రైల్వే కౌంటర్లకు వెళ్లి... టికెట్ బుక్‌చేసుకోవాలంటే... చేతిలో డబ్బులు ఉండి తీరాల్సిందే. టికెట్‌కు సరిపడా చిల్లర లేకపోతే.. అదో సమస్య. ఇకపై అలాంటి సమస్యలు లేకుండా... సరికొత్త నిర్ణయం తీసుకుంది రైల్వే శాఖ. డిజిటల్ పేమెంట్స్ విధానం ప్రవేశపెట్టి... అటు ప్రయాణికులకు... ఇటు టికెట్ కౌంటర్‌లోని సిబ్బందికి కాస్త రిలీఫ్ ఇస్తోంది.రైల్వే స్టేషన్‌లోని అన్ని టికెట్ కౌంటర్ల వద్ద యూపీఐ పేమెంట్స్ చేయవచ్చు. అందుకోసం... టికెట్ కౌంటర్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ యాప్ ద్వారా చెల్లింపులు చేసేలా దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. యూపీఐ యాప్ ద్వారా కానీ.... లేదా డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేసే వీలు కల్పించింది. ఇందుకోసం.. ఇప్పటికే అన్ని రైల్వే స్టేషన్లలో 466 పీఓఎస్ మిషన్లు, యూపీఐ క్యూఆర్ కోడ్‌లను అమర్చినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. దాదాపు అన్ని స్టేషన్లలో ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్, అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ కౌంటర్లలో ఈ మిషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిజిటల్ సదుపాయాల్ని బలోపేతం చేయడానికే... రైల్వే టికెట్ కొనుగోలులో నగదు రహిత విధానాల్ని ప్రవేశపెట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ విధానం వల్ల రైల్వే ప్యాసింజర్ల సమయం ఆదా అవుతుందని చెప్పారు. ప్రస్తుతం ప్రజలు యూపీఐ పేమెంట్స్ కోసం గూగుల్ పే, ఫోన్ పే సహా పేటీఎం లాంటి డిజిటల్ చెల్లింపుల అప్లికేషన్స్ వాడుతున్నారు. తాజాగా రైల్వే శాఖ తీసుకున్న ఈ నిర్ణయం అందరికీ అనువుగా ఉంటుంది అధికారులు భావిస్తున్నారు. చిల్లర కష్టాలు తీరడమే కాకుండా.... టిక్కెట్టు తీసుకునే వారి సంఖ్య కూడా పెరుగుతుందని భావిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే తీసుకున్న నిర్ణయంపై రైలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనరల్ టికెట్ కూడా డిజిటల్ పేమెంట్ ద్వారా కొనుక్కోవచ్చని... సంబర పడుతున్నారు.

నిలోఫర్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్-ప్రభాతసూర్యుడు : హైదరాబాద్ నాంపల్లి నీలోఫర్ హాస్పిటల్లో అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులో ఉన్న ల్యాబ్లో మంటలు చెలరేగాయి. దీంతో ఆస్పత్రి పరిసరాలు పొగతో నిండిపోయాయి. ఆస్పత్రికి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

ఏనుగుల రాకేశ్‌కు ఎమ్మెల్సీ!?

- పట్టభద్రుల మండలి ఎన్నికల్లో దక్కనున్న అవకాశం
- వరంగల్ - ఖమ్మం- నల్లగొండ స్థానంలో పోటీ
- అధిష్టానం దృష్టికి తీసుకెళ్లిన పలువురు గులాబీ పెద్దలు
- అప్పటి హామీ మేరకు ఛాన్స్ గ్యారంటీ అంటూ ప్రచారం

వరంగల్-ప్రభాతసూర్యుడు : అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీజేపీలో కొనసాగిన ఆయన ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేసేందుకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ టికెట్ ఆశించగా.. ఆ పార్టీ అధిష్టానం నుంచి రాకేశ్ రెడ్డికి నిరాశే ఎదురైంది. ఆ తరువాత పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన.. ఎమ్మెల్సీ పదవి హామీతోనే గులాబీ కండువా కప్పుకున్నారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని ఆయనకే కేటాయిస్తా-రనే ప్రచారం జోరందుకుంది. ప్రతిష్టాత్మక బిట్స్ పిలానీలో చదివిన పేరు, అక్కడ స్టూడెంట్ లీడర్‌గా ఎదిగిన తీరు, టీవీ డిబేట్లు, పదునైన మాటలతో ఏనుగుల రాకేశ్ రెడ్డి రాజకీయంగా తనపేరు ప్రజలకు తెలిసేలా చేశారు. మొదట్నుంచీ బీజేపీలోనే పని చేసిన ఆయన ఆ పార్టీ భావజాలంతోనే జనాలకు సుపరిచితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ టికెట్ పై ఆశలు పెట్టుకున్న రాకేశ్ రెడ్డి.. చివరకు ఆ టికెట్ మహిళా కోటాలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న రావు పద్మారెడ్డికి దక్కడంతో ఆయన నిరాశకు గురయ్యారు. ఆ త-రువాత పార్టీ కోసం కష్టపడుతున్నా అధిష్టానం నుంచి సరైన గుర్తింపు లభించని కారణంగా ఎన్నికలకు కొద్దిరోజుల ముందు బీజేపీ నుంచి తన క్యాడర్‌తో కలిసి తప్పుకున్నారు. ఆ తరువాత అప్పటి ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి ప్రోద్బలంతో అప్పటి మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిని మూటగట్టుకోగా.. అప్పటి నుంచి రాకేశ్ రెడ్డి కూడా ఎక్కడా యాక్టివ్‌గా కనిపించిన దాఖలాలు లేవు.

వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా 2021లో ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. వాస్తవానికి 2027 మార్చి 29వరకు పదవీ కాలం ఉండటంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ మేరకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌కు ఎన్నికల నిర్వహణపై ఆదేశాలిచ్చింది. తొలి దశలో ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇదిలాఉంటే రాకేశ్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరే క్రమంలోనే ఎమ్మెల్సీ పదవి హామీతోనే గులాబీ కండువా కప్పుకుంటున్నారనే ప్రచారం జరిగింది. పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి ఇద్దరూ స్పష్టంగా అదే హామీ ఇచ్చి రాకేశ్ రెడ్డిని పార్టీకి తీసుకెళ్లారనే ఆరోపణలున్నాయి. కాగా ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎన్నికలకు కసరత్తు జరుగుతుండటంతో ఇన్నిరోజులు తెరమరుగునే ఉన్న రాకేశ్ రెడ్డి పేరు.. మళ్లీ తెరమీదకు వచ్చింది. ఉన్నతంగా చదివిన వ్యక్తి కావడంతోపాటు స్థానిక సమస్యలు తెలిసి ఉన్న నేత కావడం, విద్యారంగంపై పట్టున్న నేపథ్యంలో ఆయనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. రాకేశ్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకునే సమయంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి హామీ ఇచ్చిన నేపథ్యంలో వారిద్దరూ కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని రాకేశ్ రెడ్డికే కేటాయించాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. దీంతోనే ఇటీవల మళ్లీ తెరమీదకు వచ్చిన రాకేశ్ రెడ్డి చదువుకున్న యువతతో ఇంటరాక్ట్ అయ్యే ప్రయత్నాల్లో పడ్డారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సోషల్ మీడియా వేదికన విజ్ఞప్తి కూడా చేస్తున్నారు. తన క్యాడర్ తో పట్టభద్రులకు దగ్గరయ్యే ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫిబ్రవరి 6 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉండగా.. ఏప్రిల్ 4 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రకటించడంతోపాటు జూన్ 8 నాటికి ఉప ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకుని, ఎమ్మెల్సీ స్థానాలపైనా కన్నేయగా.. బీఆర్ఎస్ పార్టీ కూడా టికెట్ల కేటాయింపులో తీవ్ర కసరత్తు చేస్తోంది. మరి వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాన్ని ఆ ఇద్దరు నేతలు పట్టుబడుతున్నట్టుగా రాకేశ్ రెడ్డికే కేటాయిస్తుందో.. లేదా మరెవరికైనా అవకాశం ఇస్తుందో చూడాలి.

హామీలపై స్పష్టత లేదు

- ప్రజలకు నిరాశ మిగిల్చిన గవర్నర్ ప్రసంగం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : : హామీల అమలుకోసం ఎదురు చూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం నిరాశ మిగిల్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎన్నికల హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై విశ్వాసం కల్పించలేకపోయిందన్నారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి ఇస్తారో గవర్నర్ ప్రసంగంలో చెప్పలేదన్నారు. రైతులకు బోనస్ ఇచ్చే విష-యమై ఒక్క మాటా లేదన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేలు ఇచ్చే విషయాన్నీ ప్రస్తావించలేదన్నారు. గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ గురించి మాత్రమే చెప్పారు. మేనిఫెస్టో అంశాల గురించి ఎక్కడా చెప్పలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ, గవర్నర్ ప్రతిష్ట దిగజార్చిందన్నారు. ప్రజావాణి తుస్సుమన్నదని విమర్శించారు. ప్రజావాణిలో రోజూ సీఎం స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. మొదటి రోజు తరువాత సీఎం మొహం చాటేశారని విమర్శించారు. ప్రజావాణికి రోజుకొక మంత్రి వెళ్తారన్నారు.. అదీ లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దరఖాస్తులు తీసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కలెక్టర్లు దరఖాస్తులు తీసుకునేవారని వెల్లడించారు. ప్రజావాణి గురించి గర్నవర్‌తో అర్థసత్యాలు చెప్పించారన్నారు. ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో మూడు చెప్పి ఒక గ్యారంటీ అమలుచేశామని చెబుతారా అని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ అమలు లోపభూయిష్టంగా ఉన్నందునే గవర్నర్ ప్రసంగంలో చెప్పించలేదన్నారు. నిర్దిష్ట సమ-యంలో ఆరు గ్యారంటీలు అమలు చేసా-మన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైతులకు ఇచ్చిన నాలుగు హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. డిసెంబర్ 9న అధికారంలోకి వస్తాం, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. అయితే ప్రమాణ స్వీకారాన్ని ముందుకు జరిపి.. హామీల అమలును వాయిదా వేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో 60 రోజులు పూర్తయ్యాయ, ఇంకా 40 రోజులే ఉన్నాయని గుర్తుచేశారు. మరో పది రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది.. అప్పటివరకు సాగదీసి హామీల అమలు వాయిదా వేయాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. ఎన్నికల కోడ్ వస్తే హామీలు ఎలా అమలు చేస్తారని నిలదీశారు. చిత్తశుద్ధి ఉంటే హామీల అమలు గురించి గవర్నర్ ప్రసంగంలో ఉండేదన్నారు. రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు కరెంట్ గురించి మా-త్రమే ప్రస్తావించారని, మిగతా హామీలు వచ్చే ఏడాదిలో చేయలేమని అని చెప్పకనే చెప్పారని వెల్లడించారు. వంద రోజుల్లో అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. రూ.15 వేల రైతుభరోసా ఇస్తామన్నారు, 10 వేల రైతుబంధు కూడా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వచ్చే యాసంగి పంటకు అయినా బోనస్ ఇస్తామని చెబుతారని ఎదురు చూశాం.. కానీ నిరాశ ఎదురైందన్నారు. రూ. 40 వేల కోట్ల పెట్టుబడిపై వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ఊసేలేదని విమర్శించారు. మూసీ నది ప్రక్షాళన బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రారంభించిందని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం ఇస్తారన్నారు.. కానీ 7వ తేదీ వచ్చినా జీతాలు పడలేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణం. రెండు, మూడు నెలల నుంచి వారికి జీతాలు లేవన్నారు.

13 వరకు అసెంబ్లీ

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్ లో గురువారం బీఏసీ సమావేశం ముగిసింది. ఈ నెల 13 వరకూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. ఈ నెల 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సభలో చర్చిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 10న ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నట్లు చెప్పారు. 12, 13న బడ్జెట్ పై అసెంబ్లీలో చర్చ జరగనుందని వెల్లడించారు. కాగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తొలిసారి కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇది. బీఏసీ సమావేశంలో ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. అటు, బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, హరీష్ రావు, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. మరోవైపు, బడ్జెట్ సమావేశాలు 4 రోజులే నిర్వహించడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సభ కనీసం 12 రోజులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెడుతున్నట్లు ప్రభుత్వం చెప్పిందని.. సభ కనీసం 12 రోజులు నిర్వహించాలని సర్కారును కోరినట్లు తెలిపారు. అవసరమైతే 13న మరోసారి బీఏసీ నిర్వహిస్తామని చెపా-ప్పారని కడియం పేర్కొన్నారు. 'త్వరగా బడ్జెట్ ఆమోదించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజా సమస్యలు ప్రస్తావించే అవకాశమే లేకుండా పోతుంది. హామీలపై నిలదీస్తామనే త్వరగా ముగించాలని చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రోటోకాల్ వివాదం ఏర్పడుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులు ఓడినా వారే మాకు ఎమ్మెల్యేలు అని సీఎం చెప్పారు. ఈ వ్యాఖ్యలతో అధికారులు రెచ్చిపోతున్నారు. రాబోయే రోజుల్లో ఇది శాంతి భద్రతల సమస్యలకు దారి తీస్తుంది. ప్రోటోకాల్ ఉల్లంఘన జరగకుండా చూస్తామని సభాపతి, సీఎం హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గ్యారెంటీలు, హామీల అమలుపై ప్రశ్నిస్తామనే 4 రోజులే సమావేశాలు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీలో అవకాశం రాకపోయినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం.' అని కడియం స్పష్టం చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత కేసీఆర్ కు బదులు హరీశ్ రావు హాజరయ్యారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్...శాసనసభా వ్యవహారాల మంత్రికి సమాచారం కూడా ఇచ్చారు. అయితే బీఏసీ సమావేశానికి హరీశ్ రావు రావడాన్ని అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తప్పుబట్టారు. కేసీఆర్ కు బదులు హరీశ్ రావు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో హరీశ్ రావు సమావేశంలో పాల్గొనకుండానే బయటకు వచ్చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. అయితే, తాము ఎవరినీ బీఏసీ సమావేశం నుంచి వెళ్లమని చెప్పలేదని.. స్పీకర్ నిర్ణయం మేరకు బీఏసీ.. బీఆర్ఎస్ నుంచి ఇద్దరు సభ్యులకు అవకాశం ఇచ్చారని తెలిపారు. ఆ పార్టీ నుంచి కేసీఆర్, కడియం పేర్లు ఇచ్చారని.. కేసీఆర్ రావడం లేదు కాబట్టి తాను వస్తానని హరీష్ రావు చెప్పినట్లు వెల్లడించారు. ఒక సభ్యుడు రావడం లేదని.. ఇంకో సభ్యున్ని అనుమతివ్వరని మంత్రి స్పష్టం చేశారు.

టాలీవుడ్‌లో కిలేడీ ప్రొడ్యూసర్

మొదటిపేజీ తరువాయి..

చెప్పింది. దీనికి నాగార్జునబాబు కూడా ఒప్పుకున్నాడు. ఇద్దరూ చిలుకూరు బాలాజీ దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత నెమ్మదిగా అతన్ని మాయలో పడేసింది. అతని దగ్గర ఉన్న డబ్బంతా రాబట్టుకోవడం మొదలుపెట్టింది. మాయమాటలు చెప్పి... ముందు 18లక్షల 50వేల రూపాయల నగదు తీసుకుంది. ఆ తర్వాత మరో 10లక్షల రూపా-యలను తన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయించుకుంది. డబ్బులన్నీ ముట్టజెప్పేశాక... ఎందుకో నాగార్జునబాబుకు ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చింది. ఆమె గురించి ఆరా తీశాడు. అసలు విషయం తెలిసి షాకయ్యారు. ఆ లేడీ ప్రొడ్యూసర్‌కి ఇదివరకే రెండు పెళ్లిళ్లు అయ్యాయని, ముగ్గురు పిల్లలు ఉన్నారని నాగార్జున తెలిసింది. అయితే.. తనకు ఒకసారి మాత్రమే వివాహం అయ్యిందని.. పిల్లలు లేరని చెప్పడంతో... మోసపోయానని గ్రహించాడు నాగార్జునబాబు. పెళ్లి పేరుతో మోసం చేసి.. తన డబ్బులన్నీ కాజేసిందని తెలుసుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో... కిలేడీ ప్రొడ్యూసర్ బాగోతాలన్నీ బయటపడ్డాయి. గతంలోనూ ఆమె పలువురి మోసం చేసిందని... కేసులు పెట్టి వేధించిందని పోలీసులు గుర్తించారు. విశాఖ గాజువాక పోలీస్‌స్టేషన్‌లో భరత్ అనే వ్యక్తిపై, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాస్ అనే వ్యక్తిపై, నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కార్తికేయ అనే వ్యక్తిపై కేసులు పెట్టిందని తెలుసుకున్నారు. ఇలా ఇంకా ఆమె బాధితులు ఎంత మంది ఉన్నారు అన్న విషయంపై ఆరా తీస్తున్నారు పోలీసులు. నాగార్జున... తనను కూడా బ్లాక్‌మెయిల్ చేసి ఇబ్బందులకు గురిచేస్తుందంటూ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

వాళ్లకు వాళ్లే.. సవాళ్లు..!

మొదటిపేజీ తరువాయి..

మధుసూదన్‌రెడ్డి, కైలాశ్‌నేత, వెంకటేశ్వర్లు, వెంకటే శ్‌యాదవ్, బచన్‌కుమార్, శ్రీకాంత్‌యాదవ్, కొత్తగా పార్టీలో చేరే ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా పదవులు ఆశిస్తున్నారు. కాంగ్రెస్‌లో సుదీర్ఘంగా పనిచేస్తున్నవారు కూడా పదవులపై ఆశతో ఉన్నారు. వీరికి కూడా 56 పదవుల్లోనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి. మరి కాంగ్రెస్ రాష్ట్ర, జాతీయ నాయకత్వం వీరిని ఎలా సర్దుబాటు చేస్తుందో చూడాలి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

యూసుఫ్‌గూడలో దారుణ హత్య

హైదరాబాద్- ప్రభాతసూర్యుడు : జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. యూసుఫ్ గూడలో రాములు అనే వ్యక్తిని రాత్రి 11 గంటల సమయంలో 10 మంది గుర్తు తెలియని దుండగులు కత్తులతో వచ్చి అత్యంత దారుణంగా హత్య చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో స్పాట్ చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ సింగోటం రాములు గత కొంత కాలంగా పలు సోషల్ సర్వీస్ చేస్తున్నాడు. గత ఎన్నికల్లో బిజెపి పార్టీలో చేరిన రాములు, హత్యకు గల కారణాలపై జూబ్లీహిల్స్ పోలీసులు ఆరా తీస్తున్నారు. న దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయమ్..

అడ్డదారి తొక్కుతున్న టెక్నాలజీ

డీప్ ఫేక్.. ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్న ప్రధాన అంశం. టాప్ సెలబ్రిటీల నుంచి సామాన్య ప్రజలు దీని బారిన పడుతున్నారు. సెలబ్రిటీల ఫొటోలు మార్ఫింగ్ చేయడం, వీడియోల్లో ఫేస్‌ను మార్చి అశ్లీలంగా చూపించడం, వాయిస్‌ను మార్చి ఆన్ లైన్ గేమింగ్ వంటి ప్లాట్ ఫామ్స్‌ను ప్రమోట్ చేయడం వంటివి చేస్తున్నారు. ప్రధాన మంత్రి నుంచి పల్లెల్లో నివసించే సామాన్య పౌరుల దాకా ఈ డీప్ ఫేక్ బాధితులుగా మిగులుతున్నారు.ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినాక డీప్ ఫేక్‌ల బెడద నిత్యకృత్యమైంది. ఏఐ సాంకేతికతను ఉపయోగించి సెలబ్రిటీల ఫేస్‌లను చాలా సులభంగా మార్ఫింగ్ చేస్తున్నారు. ముఖంతో పాటు హావభావాలు, ముఖ కవలికలను అచ్చు గుద్దినట్టు దించేస్తున్నారు. దీంతో ఒరిజినల్ వీడియోలకు ఫేక్ వీడియోలకు కొంచెం కూడా తేడా లేకుండా చేస్తున్నారు. వాయిస్‌లను సైతం ఒరిజినల్‌గా మాట్లాడినట్టే సృష్టిస్తున్నారు.ఈ టెక్నాలజీని క్రియేటివ్, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూపొందించారు. అసాధ్యం అయిన వాటిని ఈ టెక్నాలజీతో సుసాధ్యం చేసి చూపించవచ్చు. యమదొంగ అనే సినిమాలో సీనియర్ ఎన్టీఆర్ వచ్చి జూనియర్ ఎన్టీఆర్ తో స్టెప్పులు వేశాడు. ఇలా చాలా మంది నటీనటులు చనిపోయాక తెరపై తళుక్కున మెరిశారు. ఇదంతా డీప్ ఫేక్ ద్వారానే సాధ్యమైంది. వీటిని మంచి కోసం వాడినంత వరకు బాగానే ఉంటుంది. కానీ చాలా మంది కేటుగాళ్లు దీన్ని ఆసరాగా చేసుకుని ఏఐ టెక్నాలజీని ఉపయోగించి అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మంచికోసం తయారు చేసిన ఏఐ టెక్నాలజీని ఇతరులను మోసం చేయడానికి, సంస్థలు, ప్రభుత్వాలను మోసం చేయడానికి వినియోగిస్తున్నారు. అధ్యక్షుడు జో బైడెన్ 2020 ఎన్నికల సమయంలో పలుమార్లు డీప్ ఫేక్ బారిన పడ్డారు. మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, డొనాల్డ్ ట్రంప్ సైతం డీప్ ఫేక్ మాయాజాలంతో ఇబ్బందులు పడ్డారు. యుద్ధ సమయంలో పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సైతం సంచలన ప్రకటనలు చేసినట్లు ఈ ఫేకర్లు చాలా పుకార్లే సృష్టించారు. ఆ మధ్య ఒక జర్నలిస్టు బిల్ గేట్స్‌ను చాలా సీరియస్‌గా ప్రశ్నలు అడిగి ఇబ్బందులు పెట్టినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయింది. అది కూడా డీప్ ఫేక్ మాయాజాలమే. ఇటీవల చాలా మంది బాలీవుడ్, టాలీవుడ్ సెలెబ్రిటీలు వివిధ రకాల బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలన్నీ డీపీ ఫేక్ గాళ్లు చేసిన ఘన కార్యాలేడీప్ ఫేక్‌ను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టాలు తేవాల్సిన అవసరం ఉంది. బలమైన చట్టం లేకుంటే డీప్ ఫేక్‌ను తయారు చేసేవాళ్లు మరింత విచ్చలవిడిగా రెచ్చిపోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం అన్ని వ్యవస్థలపై తీవ్రంగా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐటీ చట్టంలోని 66డి, 67, 67ఎ కింద కంప్యూటర్ ద్వారా మోసం చేయడం, వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడం అనే నేరాలకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధించవచ్చు. ఐపీసీ సెక్షన్ 500 కింద పరువు నష్టం కలిగించినందుకు శిక్షించవచ్చు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే డీప్ ఫేక్ ఘటనలను అదుపు చేయడానికి కఠిన చట్టాలు తీసుకురావాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి.ఒక వీడియో, ఫొటో, స్పీచ్ చూడగానే దాన్ని నిశితంగా పరిశీలించాలి. ఫేక్ కంటెంట్ అని అనుమానం ఉంటే దాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేయకూడదు. అలాంటి మీ మొబైల్‌కు వస్తే వెంటనే డిలీట్ చేయాలి. వ్యక్తిగత ఆడియో, వీడియోలను ఇతరులకు పంపకూడదు. బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, అకౌంట్ నంబర్లను ఫోన్లలో ఎవరికీ చెప్పకూడదు. మీ ఫోన్ నుంచి సింగిల్‌గా ఉన్న ఫొటోలు షేర్ చేయకపోవడం మంచిది. మీ సోషల్ మీడియా అకౌంట్లకు డీపీలుగా మీరు సింగిల్‌గా ఉన్న ఫొటోలు పెట్టుకోకూడదు.

అచ్చుగుద్దినట్టు అయోధ్య రాముడే!

- రాయ్‌చూర్‌లో బయల్పడిన విష్ణుమూర్తి! విగ్రహం
- అయోధ్య రాముడి ఆనవాళ్లతో దర్శనం
- పురావస్తు తవకాల్లో శివలింగమూ ప్రత్యక్షం
- ఆశ్చర్యచకితులవుతున్న అధికారులు, భక్తులు

బెంగళూరు, ప్రభాతసూర్యుడు : రాయ్‌చూర్‌లో కృష్ణా నదీ తీరాన బయటపడిన విష్ణుమూర్తి విగ్రహం అచ్చం అయోధ్య బాల రాముడి విగ్రహాన్ని పోలి ఉంది. అచ్చం అయోధ్య బాల రాముడి విగ్రహాన్ని పోలిన విగ్రహాన్ని కర్ణాటకలోని రాయ్‌చూర్‌లో కనుగొన్నారు. మొత్తం దశావతారాలతో కూడిన విష్ణుమూర్తి విగ్రహం దాదాపు అయోధ్య రాముడినే పోలి ఉండడం ఆసక్తికరంగా మారింది. దీంతో పాటు ఓ శివలింగమూ బయటపడింది. రాయ్‌చూర్‌లో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో ఇవి వెలుగులోకి వచ్చాయి. ఈ రెండూ 11 లేదా 12వ శతాబ్దానికి చెందినవిగా భావిస్తున్నారు పురావస్తు శాఖ అధికారులు. విష్ణుమూర్తి విగ్రహాన్ని కృష్ణా నదీ తీరంలో కనుగొన్నారు. అక్కడే శివలింగమూ బయట పడింది. స్థానికుల్లోనూ ఈ ఘటన ఆసక్తి కలిగించింది.

శంఖుచక్రాలతో ఉన్న విష్ణుమూర్తి విగ్రహంపై దశావతారాలు చెక్కి ఉన్నాయి. వేదాల్లో వేంకటేశ్వరస్వామిని వర్ణించినట్టుగానే ఈ విష్ణుమూర్తి విగ్రహం ఉందని అధికారులు వెల్లడించారు. అయితే...ఇక్కడ గరుడ విగ్రహం మాత్రం కనిపించలేదని తెలిపారు. అయోధ్య రాముడి విగ్రహాన్ని చెక్కిన అరుణ్ యోగిరాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ప్రతిష్ఠించిన సమయంలో చూస్తే అసలు ఆ విగ్రహాన్ని చెక్కింది తానేనా అని ఆశ్చర్యపోయానని చెప్పాడు. అలంకరణ తరవాత అంత ఆ రామయ్య విగ్రహానికి అంత అందం వస్తుందని ఊహించలేదని అన్నాడు. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన తరవాత ఏదో తెలియని అందం అందులోకి వచ్చి చేరిందని ఆనందం వ్యక్తం చేశాడు. ఓ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు. "ప్రాణ ప్రతిష్ఠ జరిగిన తరవాత బాల రాముడి విగ్రహం రూపు రేఖలే మారిపోయాయి. అసలు తయారు చేసింది నేనేనా అని నాకే అనుమానం వచ్చింది. అలంకరణ తరవాత రామయ్య స్వరూపమే మారిపోయింది. చెక్కుతున్న సమయంలోనే ఒక్కో దశలో ఒక్కో విధంగా కనిపించింది. కానీ ఆభరణాలతో అలంకరించిన తరవాతే మొత్తం రూపురేఖలు మారిపోయాయని రామ్లల్లా విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్ అన్నారు.

"బహుశా ఈ శివలింగం, విష్ణుమూర్తి విగ్రహం 11 లేదా 12వ శతాబ్దానికి చెందినవై ఉండాలి. ఈ రెండు విగ్రహాలూ ఆయా ఆలయాల్లోని గర్భగుడుల్లో ఉండి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నాం. ఇక్కడి ఆలయం నీటిలో మునిగిపోయి ఉండొచ్చు"
- పురావస్తుశాఖ అధికారులు

ధీనజన బాంధవుడు బాబా ఆమ్టే

బాబా ఆమ్టే.. అసలు పేరు మురళీధర్ దేవదాస్ ఆమ్టే. ప్రముఖ సంఘసేవకుడిగా ప్రసిద్ధిగాంచిన బాబా ఆమ్టే ముఖ్యంగా కుష్ఠు రోగుల పాలిట దేవుడిగా మారినాడు. డిసెంబర్ 26, 1914లో మహారాష్ట్రలోని వార్ధా జిల్లా హింగన్‌ఘాట్‌లో ఒక ఉన్నత దేశస్థ బ్రాహ్మణ జాగిర్దార్ కుటుంబంలో జన్మించాడు. అతని అసలు పేరు మురళీధర్ దేవదాస్ అమ్టే కాగా చిన్నతనంలోనే అతన్ని బాబా అని పిలిచేవారు. బాబా అనేది ఎవరో ప్రధానం చేసిన బిరుదు కాదు అది తల్లిదండ్రులు పెట్టిన ముద్దుపేరు. న్యాయశాస్త్రంలో శిక్షణ పొందిన తరువాత వార్ధాలో న్యాయ అభ్యాసం ప్రారంభించాడు. అదే సమయంలో భారత జాతీయోద్యమ పోరాటం జరుగుతుండేది. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్ట్ కాబడిన జాతీయ నేతల తరఫున కోర్టులలో వాదించేవాడు. క్రమక్రమంగా మహాత్మా గాంధీ వైపు ఆకర్షితుడైనాడు. గాంధీజీతో పాటు కొంత కాలం సేవాగ్రం ఆశ్రమంలో గడిపినాడు. ఆ తరువాత జీవితాంతం వరకు గాంధీజీ సిద్ధాంతాలకే కట్టుబడినాడు. వేషధారణలో కూడా గాంధీజీ వలె ఖద్దరు దుస్తులనే వాడేవాడు. గాంధీజీ వలె జీవితాంతం అణగారిన వర్గాల కృషికై పాటుపడ్డాడు. సమాజంలోని రుగ్మతలు, పేదల దీన స్థితికి చలించే ఆయన తన జీవితాన్ని కుష్ఠు రోగుల సేవలకు, వారి పునరావాసానికి కృషి చేశారు. పర్యావర్ణ పరిరక్షణకూ, అడవులు పెంపకానికి ఆయన కృషి చేశారు. కుష్ఠురోగుల సేవలకై చంద్రాపూర్ జిల్లాలో ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అతను కూడా వారితోపాటే అక్కడే జీవితాన్ని గడిపి 2008, ఫిబ్రవరి 9న తన ఆశ్రమంలోనే మృతి చెందిన మహనీయుడు. ఉన్నత కుటుంబంలో జన్మించి భోగభాగ్యాలను వదిలి అణగారిన వర్గాల మేలు కొరకై జీవితాంతం కృషిసల్పిన అతని కృషి మరవలేనిది. బాబా ఆమ్టే సేవలకు గుర్తింపుగా అనేక అంతర్జాతీయ, జాతీయ అవార్డులు వచ్చాయి. రామన్ మెగసేసే అవార్డు, జాతీయ పద్మ అవార్డులు ఆయనను వరించాయి.

-నేడు వర్ధంతి



కేసీఆర్‌పై ఇష్టారీతిగా ధూషణలు

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించారు. సింగరేణి ఉద్యోగాల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చింది. 20 వేల నియామకాల డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తోంది. జనరల్ మేనేజర్ స్థాయిలో ఇవ్వాల్సిన ఉద్యోగాలు, హైదరాబాద్ లో సీఎం లాంటి వాళ్ళు ఇవ్వటం సిగ్గు చేటు. డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తు మేమే ఉద్యోగాలు ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్నారు. అబద్ధాలు చెప్పటం రేవంత్ రెడ్డి మానుకోవాలి. కేసిఆర్ చేసిన పనులు మీరు చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. కేసిఆర్ ను ఇష్టానుసారంగా దూషిస్తున్నారు. తెలంగాణ ఉద్యోగాలు ఆంధ్ర వారికి ఇస్తోంది ప్రభుత్వం. మా ప్రభుత్వం తప్పు చేసింది అనుకుంటే మీరైనా సరి చేసుకోవచ్చు కదా రేవంత్ రెడ్డి అని అన్నారు. పెద్ద యెత్తున మహేందర్ రెడ్డి పైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. టీఎస్పీఎస్సీ ఛైర్మెన్ ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నాని అన్నారు. అవినీతి ఆరోపణలు వస్తున్న మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి పైన జ్యూడిషియల్ ఎంక్వైరీ వేయాలి. తెలంగాణ లో కరెంట్ కోతలు మొదలయ్యాయి.

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఆంధ్ర వాళ్ళని డైరెక్టర్ లను నియమించారు. తెలంగాణ కు నిరంతర కరెంట్ ఇవ్వటం లో వీళ్ళు ఎంత భాగస్వామ్యం అవుతారు. మీలో పచ్చ రక్తం పారతుంది కాబట్టే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. లంగాణ అసెంబ్లీ కి ఆంధ్ర అడ్వైసర్ ఎందుకని అన్నారు. రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహ మార్పు పై ఎమ్మెల్సీ కవిత కౌంటర్ ఇచ్చారు. జై తెలంగాణ అని కనీసం అనని వ్యక్తి రాష్ట్ర గీతం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ఎక్కడ రాష్ట్ర గీతం పెట్టుకోవాలని రాజ్యాంగం లో లేదు. తెలంగాణ తల్లి విగ్రహం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం ఏంటి ?. నాలాగా ఉందని తెలంగాణ తల్లి విగ్రహం ఉందని చెప్తున్నారు. నేను తెలంగాణ ఆడ బిడ్డనే కదా అని అన్నారు.

ఖర్గే పేపర్.. మాకు దిష్టిచుక్క!

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ- ప్రభాతసూర్యుడు : గత పదేళ్ల మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రవేశపెట్టిన 'బ్లాక్ పేపర్' పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ప్రతిపక్ష పార్టీ విడుదల చేసిన ఆ పేపర్ తమ ప్రభుత్వానికి 'దిష్టి చుక్క'లాంటిదని వ్యాఖ్యానించారు. తమపై చెడు కన్ను పడకుండా చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే 'బ్లాక్ పేపర్'ను గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఆ పత్రాన్ని విడుదల చేసిన వెంటనే మోదీ.. పదవీకాలం ముగియనున్న ఎంపీలకు వీడ్కోలు పలికేందుకు రాజ్యసభకు వెళ్లారు. సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ చర్యపై స్పందించారు. 'ఖర్గేజీ ఇక్కడ ఉన్నారు. ఓ పిల్లాడు ఏదైనా మంచి చేస్తే. ప్రత్యేక సందర్భంలో ఆ పిల్లాడికి మంచి దుస్తులు వేస్తే.. చెడు కల్లు పడకుండా ఉండేందుకు కుటుంబంలో ఎవరైనా దిష్టి చుక్క పెడతారు. అలాగే, గత 10 ఏళ్లుగా దేశం కొత్త శ్రేయస్సు శిఖరాలను అధిరోహిస్తోంది. అందుకు మన ప్రభుత్వంపై చెడు కన్ను పడకుండా మనం సురక్షితంగా ఉండేందుకు కాలా తిక (దిష్టి చుక్క) పెట్టే ప్రయత్నం జరిగింది. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన బ్లాక్ పేపర్ మా ప్రభుత్వానికి దిష్టి చుక్క లాంటిదే. మాపై చెడు చూపులు పడకుండా చేస్తుంది. ప్రతిపక్షాల చర్యను మేం స్వాగతిస్తున్నాం. అందుకు నేను ఖర్గే జీకి కృత జ్ఞతలు తెలియజేస్తున్నాను' అంటూ మోదీ వ్యంగ్యంగా స్పందించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215